## క్లుప్తంగా

### కంట్రోల్ రూం ఏర్పాటు


తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ భాస్కర్ సూచించారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశ ఉందన్నారు. వంకలు, చెరువుల సమీపంలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ల్యాండ్ నంబర్ 08554220009, 8639586191, 9182634493, 9581861104లో సంప్రదించాలని కోరారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గుమ్మఘట్ట: రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అవసరమైన వేళల్లో వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### తాత్కాలిక కాలువలు తవ్వుకోండి

కళ్యాణదుర్గం రూరల్: భారీ వర్షలు కురిసే అవకాశం ఉందని, రైతులు ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు తాత్కాలిక కాలువలు నిర్మించుకోవాలని ఉద్యాన అధికారి కృష్ణతేజ తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామంలో వ్యవసాయ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. భారీ వర్షాలతో పొలాల్లోకి వర్షపునీరు చేరకుండా తాత్కాలిక డ్రెయినేజీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ మోటార్లు, ఉపకేంద్రాలవద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

### పంట నమోదు వేగవంతం చేయండి

కూడేరు: పంటల నమోదు (ఈ–క్రాప్) పట్ల అలసత్వం వహించొద్దని తహసీల్దార్ మహబూబ్ బాషా వ్యవసాయ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తన చాంబర్‌లో పంటల నమోదుపై సమీక్షించారు. ఈ –క్రాప్ నమోదు గడువు ఈ నెల 15 వరకే ఉందని, అయితే ఇక్కడ నమోదు శాతం తక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి విజయ కుమార్, ఆర్‌ఐ ప్రసన్న కుమార్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి గరుడ వాహనోత్సవం


గరుడ వాహనోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: మండలంలోని మల్లాపురంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి గరుడ వాహనోత్సం, పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీలో స్వామి ఉత్సవ విగ్రహాన్ని గరుడ వాహనంపై అధిష్టించి, ఊరేగించారు. రాతిబావివంక నరసింహశెట్టి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.

### దోమ కాటు ప్రాణాంతకం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆసియా

కంబదూరు: దోమ కాటుతోనే ప్రాణాంతక వ్యాధులు సోకుతాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఆసియా తెలియజేశారు. శనివారం మండలంలోని కదిరిదేవరపల్లిలో 104 ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. డాక్టర్ ఆసియా మాట్లాడుతూ దోమల ద్వారా డెంగీ,మలేరియా, టైఫాయిడ్ వస్తాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు.

### ముగిసిన జైనబ్బీ ఉరుసు


ప్రార్థనలు చేస్తున్న దర్గా కమిటీ సభ్యులు

ఉరవకొండ: హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాలు శనివారం ముగిశాయి. అమ్మవారి జియారత్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు పోటీ పడ్డారు. కోర్కెల గాజులు అమ్మవారి సమాధి వద్ద ఉంచి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు హోతూరు బాషా, పామిడి జాకీర్, జెండా జిలాన్, జీఎంఎస్ షాకీర్, శర్మాస్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## లోబ్రిడ్జి కింద నీరు ..
# తప్పని ఇక్కట్లు


లో బ్రిడ్జి దాటేందుకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

- వర్షానికి దెబ్బతిన్న ప్రధాన రహదారి
- మోస్తరు వర్షం కురిసినా వరదనీటి ఉధృతి
- శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్న ప్రజలు

రాయదుర్గం: వర్షం వచ్చిందంటే చాలు.. పట్టణంలోని రైల్వేలో బ్రిడ్జి కింద రాకపోకలకు అగచాట్లు పడాల్సిందే. వాహనాలు బ్రిడ్జికింద వెళ్లాలంటే సమస్యగా మారుతోంది. మోస్తరు వర్షం కురిసినా బ్రిడ్జికింద వరదనీరు వచ్చి చేరుతోంది. భారీ వర్షం కురిస్తే బ్రిడ్జి రహదారి మూసివేయాల్సి వస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టణంలోకి చేరే రాయదుర్గం– భూపసముద్రం, రాయదుర్గం– అడిగుప్ప, బైపాస్‌రోడ్డు లోని ముత్రాసకాలనీ వద్ద ప్రధాన రహదాల్లోని రైల్వే అండర్ పాస్ (లోబ్రిడ్జి) బ్రిడ్జిల వద్ద వేలాది మంది ప్రజలు ఎదుర్కొనే ప్రధాన సమస్య ఇది. ద్విచక్ర వాహనదారులు ఎలాగో అష్టకష్టాలు పడి నీటిలో తోసుకుంటే వస్తే, కార్లు, ఆటోలు, ఇతర వాహనదారులు ఆ సాహసం చేసేందుకు జంకుతున్నారు. తుపాన్లు పట్టుకుంటే ఈ మార్గాల్లో కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాల్సి వస్తోందని ఆయా మార్గాల్లోని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

### కోతకు గురైన దారులు..


వర్షానికి కోతకు గురైన రాయదుర్గం–ఉడేగోళం ప్రధాన రహదారి

ఇటీవల రాయదుర్గంలో కురిసిన బారీ వర్షానికి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల, శ్మశాన వాటిక, చంద్రబాబు పార్కుకు ఏర్పాటు చేసిన ప్రహరీ దెబ్బతిని కుప్పకూలాయి. పలుచోట్ల అంతర్గత దారులు కోతకు గురయ్యాయి. రాయదుర్గం– భూపసముద్రం మార్గం మధ్యలోని ఉడేగోళం చెరువుకు భారీగా వర్షం నీరు వచ్చి చేరాయి. ఈనేపథ్యంలో వరద నీటి తాకిడికి ఇటీవల నిర్మించిన ఆర్‌అండ్‌బీ దారి పెద్దఎత్తున కోతకు గురైంది. దీంతో ప్రయాణీకులు రాత్రిళ్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలియని వారు వేగంతో వచ్చి, వాహనాలు అదుపుతప్పి కింద పడి, ప్రమాదాలకు గురవుతున్నారు. కోతకు గురైన రహదారులను గుర్తించి, ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని ఆర్‌అండ్‌బీ డీఈ రవిశంఖర్‌రెడ్డి తెలిపారు. నిధులు మంజూరుకాగానే సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. రైల్వే అండర్ పాస్ కింద నిల్వ ఉండే నీటిని మళ్లించే విషయంపై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు.

# ఎటుచూసినా అపరిశుభ్రతే


బ్రహ్మసముద్రం మండల కేంద్రంలో నెలకొన్న అపరిశుభ్రత


బ్రహ్మసముద్రం ఎస్సీ కాలనీలో మడుగును తలపిస్తున్న మురుగునీరు

బ్రహ్మసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొంది. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ప్రధాన రహదారులు వీధుల్లో చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండి పోతున్నాయి. మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీల్లో పంచాయతీకొక్కటి చొప్పున ఫాగింగ్ యంత్రాలు రూ.లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేశారు. యంత్రాలు కొనుగోలు చేసినా వాటిని వినియోగించడంలేదు. వేపులపర్తి, బ్రహ్మసముద్రం, కన్నేపల్లి, పాలవెంకటాపురం వంటి మేజర్ పంచాయతీల్లోనూ అధికారులు పర్యవేక్షణ కరువైంది. వారాల తరబడి చెత్త పేరుకుపోతోంది. దీంతో ప్రజలు దోమల బెడద, దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లో పారిశుధ్యం పడకేయడంతో గ్రామాల్లో చెత్త గుట్టలు గుట్టలుగా మారి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. దోమలు రాత్రి పగలు అనే తేడా లేకుండా దండయాత్ర చేస్తున్నాయి. ఇళ్లల్లోనూ బయట అనే తేడా లేకుండా అన్ని చోట్లా బెడద ఎక్కువైంది. రోడ్లపై చెత్తను తీసివేయాలని, వీధుల్లో డ్రైనేజీ సదుపాయం లేక మురుగు నీరు రోడ్లపై పారుతోంది.

# అర్హులందరికీ పింఛన్ల పంపిణీ


గోనబావిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు


బోరంపల్లిలో దివ్యాంగుడికి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని, ఆర్డీఓ డాక్టర్ రాణీసుస్మిత

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ పింఛన్లు అందిస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. శనివారం మండలంలోని బోరంపల్లిలో పింఛన్ల పంపిణీకి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్డీఓ డాక్టర్ రాణీ సుస్మిత, సచివాలయ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ శానిటేషన్ పథకం కింద నియోజకవర్గాల్లోని పది పంచాయతీలకు ట్రాక్టర్లు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే చేతులమీదుగా ట్రాక్టర్లను సర్పంచులకు అందజేశారు.

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి గ్రామంలో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ నరసింహమూర్తి, సర్పంచ్ రాజేష్, డీఎల్‌డీఓ శంకర్ పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండల వ్యాప్తంగా 14 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో 5,517 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ దాసానాయక్ శనివారం తెలిపారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న 15 గ్రామ పంచాయతీల పరిధిలో 6,170 మంది పింఛన్‌దారులుండగా, 5,924 మందికి సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్ము పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి శనివారం తెలిపారు. మిగిలిన పింఛన్‌దారులకు సోమవారం అందిస్తామన్నారు.

కూడేరు: మండల వ్యాప్తంగా 5,633 మంది పింఛన్‌దారులు ఉండగా 95శాతం పింఛన్ పంపిణీ పూర్తయ్యిందని మండల స్పెషలాఫీసర్ సత్యనారాయణచౌదరి శనివారం తెలిపారు. ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండల వ్యాప్తంగా మొత్తం 5,784 మందికి గాను 5,494 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రామచంద్ర శనివారం తెలిపారు. అందుబాటులో లేని 290 మందికి పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

# శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాసం బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రావణమాసం చివరి శనివారం పురస్కరించుకొని ప్రత్యేక పుష్పాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ నరసింహారెడ్డి, అన్నదాన కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

**నేడు శ్రీవారి ఉత్సవం, బ్రహ్మ రథోత్సవం :** నేమకల్లు ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటలకు శ్రీవారి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 4.15 గంటలకు నూతన బ్రహ్మ రథాన్ని లాగనున్నట్లు తెలిపారు. సాయంత్రం 7 గంటలకు లంకాదహనం ఉంటుందన్నారు. శ్రీవారి ఉత్సవం, బ్రహ్మ రథోత్సవానికి ఏర్పాట్లు చేసినట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

**వైభవంగా అభయాంజనేయ స్వామి రథోత్సవం**

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు వద్ద వెలసిన అభయాంజనేయ స్వామి 12వ వార్షిక బ్రహ్మ రథోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకొని ఆలయంలో విశేష పూజలు చేశారు. ఉదయం ఆలయంలో రథాంగహోమం, క్షీరాభిషేకం, నెయ్యి అభిషేకం చేశారు. అనంతరం ఉదయం 12.30 గంటలకు మహిళలు, బాలికలు హారతి కళశాలతో మడుగుతేరు నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటల నుంచి రథోత్సవం నిర్వహించారు. ఉక్కడ ఆంజనేయస్వామి పల్లకీ ఉత్సవం నిర్వహించారు.


రాయదుర్గంలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయదుర్గం(డి హీరేహాళ్): శ్రావణ మాసంలో ఆఖరి శనివారం కావడంతో మురడి, నేమకల్లులో ప్రసిద్ధి చెందిన అంజన్న ఆలయాల్లో భక్తుల తాకిడి అధికంగా కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లు తగ్గలేదు. ఆలయాల వద్ద ఉచిత అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

కణేకల్లు: కణేకల్లులోని ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం నాల్గో శనివారం విశిష్ట పూజలు నిర్వహించారు. అర్చకులు విజేయంద్రస్వామి స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించి, నవనీత (వెన్న) అలంకరణ, సింధూర అర్చన, ఆకుపూజలు చేశారు. వడలమాలహారాన్ని సమర్పించారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ఆంజనేయస్వామి జలధి శనివారం వైభవంగా జరిగింది. ఏటా శ్రావణమాసం నాల్గో శనివారం జలధి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. దేవగిరి ఆంజనేయస్వామి కొండపై గంగామాతకు పూజలు నిర్వహించి, ఆలయం వరకు పల్లకీసేవ, జలధి బిందె ఊరేగించారు.

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లలో బండయ్య బావి ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ శనివార పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, ఆకుపూజ, మహామంగళహారతి,తీర్థప్రసాద వినియోగం చేశారు.

బెళుగుప్ప: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణమాసం చివరి శనివారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. రమనేపల్లి, బెళుగుప్ప, దుద్దేకుంట, బూదిగుమ్మ ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం ఉదయం నుంచి సుప్రభాత సేవ, గంగస్నాన పూజ, మంత్ర పుష్పం, పంచామృతాభిషేకాలు, పుష్పాలంకరణ పూజలు చేశారు.

**నాగదేవతకు ప్రత్యేక పూజలు**

కణేకల్లు: కణేకల్లులోని ఉరవకొండ రోడ్డులో ఉన్న నాగులకట్ట వద్ద శ్రావణమాసం నాల్గో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాభిషేకం , పుష్ప అలంకరణ, వస్త్ర అలంకరణ, నాగదేవత అర్చనలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్‌పర్సన్ కె.ఉషారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**అన్నలపురి ఆంజనేయస్వామి జాతర**

కుందుర్పి: మండల సరిహద్దున ఉన్న అన్నలపురి ఆంజనేయస్వామి జాతర శనివారం వైభవంగా నిర్వహించారు. ఏటా శ్రావణమాసం చివరి శనివారం జాతరను నిర్వహిస్తారు. స్వామిని వెండి పల్లకీలో ఉంచి రథోత్సవం నిర్వహించారు. కుందుర్పి చౌడేశ్వరి ఆలయంలో శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా వందలాదిగా మహిళలు బోనాలు తీసుకెళ్లి పూజలు చేశారు.


ప్రత్యేక అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి


కణేకల్లులో నవనీత (వెన్న) అలంకరణలో ఆంజనేయస్వామి


కుందుర్పిలో అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు

# ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన షాహీన్


సన్మాన సభలో మాట్లాడుతున్న షాహీన్

వజ్రకరూరు: ఉపాధ్యాయ వృత్తికి ఎంఎస్ షాహీన్ వన్నె తెచ్చారని వక్తలు పేర్కొన్నారు. శనివారం చిన్నహోతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం షాహీన్ ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం ఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప, ఉపాధ్యాయులు తదితరులు సన్మాన సభ ఏర్పాటు చేశారు. అనంతరం ఎంఈఓలు మాట్లాడుతూ షాహీన్ అంకిత భావంతో పనిచేసి, ఎంతో మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. అనంతరం సన్మాన గ్రహీత షాహీన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు బాల్యం సుంకులమ్మ, సురేంద్ర, మోనాలిసా, మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ మస్తానమ్మ, వైస్ చైర్మన్ నెట్టికంటయ్య, ఉరవకొండ జెడ్పీటీసీ పార్వతమ్మ, మాజీ ఎంపీపీ ఎర్రిస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అసాంఘిక శక్తుల ఆట కట్టిస్తాం


బాధ్యతలు స్వీకరిస్తున్న జయానాయక్

రాయదుర్గం: అసాంఘిక శక్తుల ఆట కట్టిస్తామని రాయదుర్గం అర్బన్ సీఐ జయానాయక్ హెచ్చరించారు. శనివారం అర్బన్ సీఐగా ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ అర్బన్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలు అరికట్టడానికి ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. డివిజన్‌లో గతంలో పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. ప్రజల హక్కులు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్కా, పేకాట, దొంగతనాలు, గంజాయి నిర్మూలనకు పెద్దపీట వేస్తామన్నారు. రాత్రివేళ గస్తీ పెంచుతామన్నారు.

# ఏకీకృత పెన్షన్ స్కీమును వెంటనే రద్దు చేయాలి

కళ్యాణదుర్గం: ఏకీకృత పెన్షన్ స్కీం (యూపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలపనున్నట్లు ఏపీటీఎఫ్ నాయకులు తెలిపారు. శనివారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశులు, రాష్ట్ర కౌన్సిలర్ జి.పాతిరెడ్డి, కళ్యాణదుర్గం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామాంజనేయులు, రమేష్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఓపీఎస్ కోసం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసనకు ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

## రేపు వైఎస్సార్ వర్ధంతి

కళ్యాణదుర్గం:మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు సెప్టెంబర్ 2న నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎస్సార్ పార్కులో ఉదయం 9 గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి పార్టీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, తప్పక హాజరుకావాలని ఆయన తెలియజేశారు.

కూడేరు: మండల కేంద్రంలో సోమవారం వైఎస్సార్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి, యువజన విభాగం రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ వై. ప్రణయ్‌రెడ్డి హాజరవుతారన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, అన్ని వర్గాల వారు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

## 'ఉపాధి' పనుల్లో అక్రమాలు

ఉరవకొండ: ఉరవకొండ ఉపాధి హామీ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి ఓ రైతు పొలంలో చేయని పనులకు చేసినట్లు చూపి ఏకంగా నాలుగు వారాల బిల్లులు రూ.2.10 లక్షలు స్వాహా చేసిన ఉదంతం వెలుగుచూసింది. బూదగవి పంచాయతీ పరిధిలో 30 మంది కూలీలతో రెండు ఫారంపాండ్ల పనులు చేయించినట్లు సృష్టించారు. ఆగస్టు నెల 1వతేదీ నుంచి 31వతేదీ వరకు పని చేసినట్లు మస్టర్‌లో చూపించి, నాలుగు వారాల బిల్లులు రూ.2.10 లక్షలు స్వాహా చేశారు. ఈవ్యవహారంలో ఉరవకొండ ఉపాధి హామీ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్‌లతో పాటు గతంలో రాజీనామా చేసిన ఫీల్డ్ అసిస్టెంట్లు కుమ్మక్కయ్యారు. గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఈశ్వరప్ప ఉపాధి పనులకు వెళ్తున్నట్లు రోజుకు రూ.300 చొప్పున రూ.1800 బిల్లు చేశారు. ఇలా కూలీలకు పనులు కల్పించకుండా బిల్లులు స్వాహా చేసినట్లు గ్రామస్తులు, కూలీలు మండిపడుతున్నారు. దీనిపై ఏపీఓ విమల మాట్లాడుతూ బూదగవి గ్రామంలో డబ్బులు డ్రా చేసిన మాట వాస్తవమేనన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారించి, అక్రమాలు జరిగి ఉంటే రికవరీ చేయిస్తామన్నారు.

## మార్మోగిన గోవింద నామస్మరణ

అనంతపురం కల్చరల్: శ్రావణమాసం చివరి శనివారం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శనిత్రయోదశి కలిసి రావడంతో వైష్ణవాలయాలు ప్రత్యేక పూజలు, శ్రీవారి నామస్మరణతో మార్మోగాయి. నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమం భక్తులతో కిటకిటలాడింది. సామూహిక గోమహాలక్ష్మి పూజలు, పాద పూజలు, ఒడిబియ్యం కార్యక్రమాలు జరిగాయి. ఆర్ఎఫ్ రోడ్డు, హౌసింగ్ బోర్డు, రామనగర్, బాబా మందిరం తదితర చోట్ల సామూహిక ఏడు శనివారాల వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివకోటి, శంకరమఠం, మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, చెరువు కట్టపై వెలసిన శనీశ్వరాలయం తదితర చోట్ల శని త్రయోదశి వేడుకల సందర్భంగా స్వామికి నవగ్రహ హోమాలు, దోషనివారణ పూజలు, తైలాభిషేకాలు చేశారు.

## సంక్షిప్త సమాచారం

**గుండ్లవల్లేరు' దోషులను శిక్షించాలి**


మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ నాయకురాలు పార్వతి

రాయదుర్గంటౌన్: ఆడపిల్లల జీవితాలతో చెలగాటమాడిన గుండ్లవల్లేరు కళాశాల దోషులను శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య (ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) రాయదుర్గం శాఖ ప్రధాన కార్యదర్శి పార్వతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పార్వతి మాట్లాడుతూ మహిళల శీలాలతో వ్యాపారం చేస్తున్న మానవ మృగాలు ఉండడం దురదృష్టకరమన్నారు. కళాశాల యాజమాన్యంతో పాటు ఈ చర్యకు పాల్పడిన నిందితులకు కఠిన శిక్షలు చేయాలన్నారు. సమావేశంలో నాయకురాళ్లు లక్ష్మీ, నాగమ్మ, స్వాతి, అక్షయ పాల్గొన్నారు.

**తంగలాన్ సినిమా ప్రదర్శన పోస్టర్ల విడుదల**

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలోని వెంకటేశ్వర థియేటర్‌లో తంగలాన్ చిత్రాన్ని ఆదివారం ఉచితంగా ప్రదర్శించనున్నట్లు ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అండ్ రాష్ట్రీయ మూలనివాసి సంఘం నాయకులు తెలిపారు. సంఘం నాయకులు శనివారం వెంకటేశ్వర థియోటర్ వద్ద పోస్టర్లను విడుదల చేశారు. మూలనివాసి సమాజ చరిత్రను ఇతివృత్తంగా తీసుకొని పా రంజిత్ తంగాలన్ సినిమాను తెరకెక్కించారని ఫెడరేషన్ అధ్యక్షుడు తగ్గుపర్తి మీను రాజగోపాల్ తెలిపారు.

**135 మందికి వైద్య పరీక్షలు**

కుందుర్పి: మండల కేంద్రంలో అనంతపురానికి చెందిన మార్క్ ఆస్పత్రి వైద్య సిబ్బంది గుండె వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. స్థానిక ప్రజావైద్యశాలలో నిర్వహించిన వైద్యశిబిరంలో గుండె వైద్యనిపుణులు కిరణ్‌కుమార్, నాగరాజు తదితరులు 135 మందికి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఆర్‌ఎంపీ హరీష్, టెక్నీషియన్ నేత్రావతి పాల్గొన్నారు.

**'పీహెచ్‌ఎన్ ఉద్యోగ విరమణ**


లక్ష్మీదేవిని సన్మానిస్తున్న వైద్యాధికారులు

బెళుగుప్ప: మండలంలోని శ్రీరంగాపురం పీహెచ్‌సీలో పబ్లిక్ హెల్త్ నర్సుగా పనిచేస్తున్న లక్ష్మీదేవి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. శనివారం పీహెచ్‌సీలో వైద్యాధికారులు లోకేష్, రిషికేష్ ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. బెళుగుప్ప పీహెచ్‌సీ వైద్యాధికారులు కార్తీక్‌రెడ్డి, ప్రియాంక తదితరులు పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ రామిరెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ వెంకటరమణ, ఎంపీహెచ్‌ఈఓలు విజయ్‌కుమార్, సిబ్బంది నారమ్మ, విజయ్ పాల్గొన్నారు.

**చికిత్స పొందుతూ యువకుడు మృతి**

బొమ్మనహాళ్: ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన బోయ రామాంజి (24) బళ్లారి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. రామాంజి గతనెల 28న పురుగుల మందు తాగి, ఆత్మహత్యాయత్నం చేశాడు. మృతుడి భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, రెండేళ్ల కుమార్తె వర్షిత ఉన్నారు.

## జాగ్రత్తలతోనే తెగుళ్ల నివారణ


విడపనకల్లులో కంది పంట పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

విడపనకల్లు: రైతులు జాగ్రత్తలు పాటిస్తేనే తెగుళ్లు నివారించుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. శనివారం మండల కేంద్రంలో అనంతపురం వ్యవసాయ శాస్త్రవేత్తలు మాధవి, నారాయణ స్వామి, నటరాజు ఏఓ పెన్నయ్య ఆధ్వర్యంలో రైతులు సాగు చేసిన సజ్జ,కంది,కొర్ర జొన్న తదితర పంటలను పరిశీలించారు. వెర్రి తెగులు నివారణ చర్యల్లో భాగంగా 60 నుంచి 90 రోజుల వ్యవధిలో లీటరు నీటికి 3 గ్రాములు నీటిలో కరిగే గంధకపు పొడి లేదా ప్రొఫెనొఫాస్ రెండు మిల్లీ లీటరు నీటిలో కలిపి పది రోజులకోసారి పిచికారీ చేయాలన్నారు. ఏడీఏ పద్మజ, ఏఈఓ రాఘవేంద్ర పాల్గొన్నారు.

**పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు**

ఉరవకొండ: మండలంలోని కోనాపురం, చిన్నముష్టూరు, లత్తవరం గ్రామాల్లో సాగు చేస్తున్న పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి శాస్త్రవేత్తల బృందం శనివారం పరిశీలించింది. ఏఆర్‌ఎస్ సీనియర్ శాస్త్రవేత్త, ప్రిన్సిపాల్ మాధవీలత, శాస్త్రవేత్త నారాయణస్వామి, నటరాజ్ మాట్లాడారు.